పూజారుల బదిలీ జీవోను ఉపసంహరించుకోవాలి

దేవాదాయ శాఖ మంత్రికి పురోహితుల వినతి


మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేస్తున్న పురోహితులు

నల్లకుంట: దేవాదాయ శాఖ పరిధిలోని చిన్నా, పెద్ద దేవాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న పురోహితులు, పూజారులను బదిలీ చేసేందుకు ఇటీవల విడుదల చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు ఆయన అర్చకులతో కలిసి మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. పూజారులను బదిలీ చేస్తే తమ కుటుంబాలు ఎలా ఇబ్బందులు ఎదుర్కొంటాయో మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువా, పూలమాలతో సన్మానించి వేద ఆశీర్వచనం అందజేశారు.

- ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పూజారుల బదిలీల సమస్యలపై ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శితో చర్చిస్తామన్నారు. పూజారులకు సమస్యలు తలెత్తకుండా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పూజారులు, చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాలకు చెందిన పురోహితులు తిరునగరి సంపత్ కుమార్, శ్రీరాములు, వెంకట్‌పూజారి ముకుంద్, తంబిరాజు, శ్రీకృష్ణ, కురుమూర్తి శ్రీరాములు, సత్యనారాయణ తదితరులు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్వరాల కాలం..!

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి: సాక్షితో ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్


ప్రొ. డా. శంకర్, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్



నల్లకుంట: హైదరాబాద్ మహానగరంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. ఇప్పటికే టైఫాయిడ్, డయేరియా కేసులు వందల్లో నమోదయ్యాయి. డెంగీ కూడా చాపకింద నీరులా విస్తరిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. అయితే పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆహారం విషయాల్లో జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులను నియంత్రించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ కాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా డయేరియా, డెంగీ, వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శంకర్ సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సోమవారం 'సాక్షి'ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

సాక్షి: సాధారణంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధులేవి ?

డాక్టర్: జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వ్యాధుల ప్రభావం ఉంటుంది. దోమ, వైరస్, బ్యాక్టీరియాలతో వ్యాధులు సోకే అవకాశం ఉంది, మలేరియా, చికూన్ గన్యా, డెంగీ, స్వైన్ ఫ్లూ, టైఫాయిడ్, మెదడువాపు, డయేరియా, కలరా, డిసెంట్రి లాంటి వ్యాధులు ఈ కాలంలో ఎక్కువగా ప్రబలుతాయి.

సాక్షి: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

డాక్టర్: ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులన్నీ ప్రాణాంతకాలే. వీటి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పడుకొనేటప్పుడు దోమల ప్రమాదం లేకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలి. మంచి(తాగు)నీటి పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలి. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలి. కాచి చల్లార్చి వడకట్టిన నీటిని తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి.

సాక్షి: ఎలాంటి ఆహారం తీసుకోవాలి ?

డాక్టర్: ఈ సీజన్‌లో రోగ నిరోధకశక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. వీటిలో సీ-విటమిన్ ఉన్న పదార్థాలు నిమ్మ, నారింజ, జామ, టమాటాలు, వెల్లుల్లి, పుట్ట గొడుగులు, పెరుగు, అల్లం, మెంతులు, బార్లీతో తయారు చేసిన పదార్థాలను తీసుకోవాలి. ఏ పూటకాపూట ఆహార పదార్థాలు వండుకొని వేడిగా ఉన్నప్పుడే తినాలి. ఆహార తయారీ పాత్రలపై మూతలు పెట్టాలి.

సాక్షి: ఏ ఏ పదార్థాలు తినకూడదు?

డాక్టర్: నిల్వ ఉంచిన మాంసం, చేపలు, ఈగలు వాలిన పదార్థాలు తినకూడదు. ఇవి తింటే వాంతులు, విరేచనాలు అయ్యే ప్రమాదం ఉంది.

సాక్షి: ఆహార పదార్థాలు వండినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

డాక్టర్: ఆహార పదార్థాలు వండేటప్పుడు, తినేటప్పుడు ముందుగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

సాక్షి: పరిసరాలు ఏ విధంగా ఉండాలి?

డాక్టర్: నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చేయాలి. ఖాళీ కొబ్బరి బోండాలు, అట్ట పెట్టెలు, రుబ్బి రోళ్లు, పూల కుండీల్లో వర్షపు నీరు లేకుండా చేయాలి. నివాస ప్రాంతాల వద్ద చెత్త ఉంచకూడదు.

సాక్షి: నిల్వ నీరు ఉంటే ఏ వ్యాధులు వస్తాయి ?

డాక్టర్: నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశముంది.

సాక్షి: ఎవరికైనా వాంతులు, విరేచనాలైనా, విషజ్వరం వస్తే ముందస్తుగా ఎవరిని సంప్రదించాలి.?

డాక్టర్: ప్రతి బస్తీలో బస్తీ దవాఖానాలు అందుబాటులో ఉన్నాయి. అక్కడికి వెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. ఇంకా అవసరమనుకుంటే నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి రావచ్చు. ఇక్కడ 24 గంటలు రోగులకు వైద్యం అందుబాటులో ఉంటుంది. రెండు, మూడు రోజులకు మించి జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలో చేర్చాలి

ఏబీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్

కాచిగూడ: ముదిరాజ్ కులస్తులను బీసీ (డీ) నుంచి బీసీ (ఏ)లో చేర్చాలని అఖిల భారత ముదిరాజ్ సంఘం (ఏబీఎంఎస్) జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఐకమత్యంతో తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీ కులస్తులలో ముదిరాజ్ కులస్తులు బీసీ (డీ) కేటగిరిలో ఉన్నందున అన్ని విధాలా వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన కోసం ముదిరాజ్‌లను ఏకతాటిపై తీసుకురావడానికి కార్యాచరణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ హయాంలో జీవో 15 ఇచ్చి ముదిరాజ్‌లను (ఏ) గ్రూపులోకి మార్చారన్నారు. అదే జీవోను ఇప్పుడున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంప్లిమెంట్ చేస్తే ముదిరాజ్‌లకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ఈ. శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, ప్రేమ్‌విమల్ ముదిరాజ్, పిట్ల నగేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవం


ఎల్లమ్మ కల్యాణోత్సవంలో కార్పొరేటర్ కన్నె ఉమారాణి

కాచిగూడ: చాదర్‌ఘాట్ రేణుకాఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆషాడమాసం రెండో మంగళవారం నిర్వహించే ఎల్లమ్మ కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శివసత్తులు (శివభక్తులు) డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ వచ్చి బోనం సమర్పించారు. ఒగ్గు సంతోష్ ఆధ్వర్యంలో కళాకారులు ఎల్లమ్మ కథను వినిపించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవ దాతలను ఆలయ ధర్మకర్త అరెల్లి అంజయ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమారాణి, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, సురేందర్, మురళీ, సదాశివ్, ప్రవీణ్ కుమార్, రాఘవేందర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

హరినగర్‌లో నీటి ఎద్దడిని పరిష్కరించండి



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ హరినగర్‌లో మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో కొన్ని రోజులుగా స్థానికులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కె.రవిచారి మంగళవారం సమస్యను పరిశీలించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని జలమండలి డీజీఎం మోహన్‌రావును కోరారు.

నివాళి

అంబర్‌పేట: అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముకుంద్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరామర్శించారు. ముకుంద్‌రెడ్డి తల్లి నీలమ్మ సంస్మరణ సభ మంగళవారం అలీ కేఫ్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై నీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముకుందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



'బీసీ' పీజీ డాక్టర్స్‌కు న్యాయం చేయాలి

కాచిగూడ: పీజీ డాక్టర్స్ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో బీసీ పీజీ డాక్టర్ల బృందం మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ... ప్రతి రంగంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పీజీ బీసీ డాక్టర్స్ ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించకుండా తాత్సారం చేసిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి బీసీ పీజీ డాక్టర్స్‌కు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పీజీ డాక్టర్స్ అక్షిత గరదాస్, వై. శ్యామిలి, అనిల్‌కుమార్, ఏ.రాజేష్, శ్యాంకుమార్‌గౌడ్, పోషం మహేష్, సీహెచ్ రత్నాకర్ పాల్గొన్నారు.

నాలాలో పూడిక తీయించండి

- ఎన్‌సీఏ ప్రతినిధులు
- సర్కిల్ 16 డీసీకి వినతి పత్రం అందజేసిన ఎన్‌సీఏ ప్రతినిధులు


డీసీ మారుతి దివాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌సీఏ ప్రతినిధులు

నల్లకుంట: నల్లకుంట పాతరామాలయం వీధి నంబర్-15 లేన్‌లో బాక్స్ నాలా పూర్తిగా వ్యర్థాలతో కూరుకుపోయి వర్షపు నీరు వీధులను ముంచెత్తుతోందని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్(ఎన్‌సీఏ), హైదరాబాద్ జిందాబాద్ ప్రతినిధులు జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ నాలా అధికారులను కోరారు. నాలాలో పేరుకుపోయిన థర్మాకోల్, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను తొలగింపచేసి ముంపు సమస్య నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఎన్‌సీఏ ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు భవాని శంకర్, కోశాధికారి శ్రీనివాస్‌రావు, కార్యనిర్వాహణ అధికారి వీరయ్య, రమేష్ తదితరులు మంగళవారం జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 డీసీ మారుతీ దివాకర్‌ను కలిసి ముంపు సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాంనగర్, నాగమయ్యకుంట నుంచి వచ్చే వరదనీరు సజావుగా వెళ్లేలా హుస్సేన్‌సాగర్ నాలాకు అనుసంధానం చేస్తూ నాలుగున్నర దశాబ్దాల క్రితం పాతరామాలయం 15వ వీధిలో పది ఫీట్ల వెడల్పు, 12 ఫీట్ల లోతుతో బాక్స్ నాలా నిర్మించారని డీసీకి వివరించామన్నారు. ఆరేళ్లుగా ఈ నాలాలో పూడికతీత పనులు చేపట్టకపోవడం కారణంగా నాలాలో మూడు, నాలుగు ఫీట్ల మేర వ్యర్థాలతో కూరుకుపోయిందని డీసీ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. నాలాలో వ్యర్థాలు కొట్టుకురాకుండా ఉండేందుకు శంకర్‌మఠ్ మార్కెట్ రోడ్డులో గల హెరిటేజ్ మాల్ వద్ద నాలాలో ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయించాలని డీసీని కోరామని చెప్పారు. దీనికి స్పందించిన డీసీ నాలాలో పూడిక తీయించి, నాలాలో చెత్త కొట్టుకు రాకుండా ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

గిరినగర్‌లో లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి


బస్తీవాసులను సమస్యను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎ.పావని

చిక్కడపల్లి: మంచినీటి సరఫరా లోప్రెషర్‌తో రావడంతో గిరినగర్ బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనికి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె నేరుగా బస్తీకి చేరుకుని జలమండలి అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. నూతన పైప్‌లైన్ పనుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు. అధికారులు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి అప్పటి వరకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ నేత ఎ.వినయ్‌కుమార్, బస్తీవాసులు సాయికుమార్, శ్రీనివాస్, సాయి, తరుణ్ పాల్గొన్నారు.

కేన్సర్‌ను గుర్తించడంలో 'ఏఐ' పాత్ర అద్భుతం

సాక్షి, సిటీబ్యూరో: రొమ్ము కేన్సర్‌ను గుర్తించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర అద్భుతమని అపోలో క్రైడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) కన్సల్టెంట్, బ్రెస్ట్, జనరల్ సర్జన్ డాక్టర్ గీతిక పకాటి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఆవిష్కరణలు ఎందరో ప్రాణాలను కాపాడటంలో సాయపడుతున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయ మామ్మోగ్రఫీ ప్రాథమిక స్థాయిలో గుర్తించేదుకు అవకాశం ఉంటుందని, అయితే ఏఐ వచ్చాక అత్యంత కచ్చితత్వంతో క్యాన్సర్లను గుర్తిస్తుందని వివరించారు. త్రీడీ మామ్మోగ్రఫీ లేదా టోమోసింథసిస్ చిత్రాలను ఏఐ మరింత లోతుగా చిత్రాలను విశ్లేషించడంలో రేడియాలజిస్టులకు సాయం చేస్తుందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడంతో పాటు చికిత్సలో కూడా ఏఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

దోమల నివారణపై అవగాహన


పీటీసీలో మాట్లాడుతున్న ఎంటమాలజీ అధికారి నిరంజన్

అంబర్‌పేట: పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట పీటీసీ వైస్‌ప్రిన్సిపాల్ పిచ్చయ్య తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి పోలీస్ శిక్షణ కేంద్రంలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కేంద్రం పరిసరాల్లో దోమల ఆవాసలను తొలగించడంపై దృష్టి పెడుతామన్నారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులు జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మోహన్, విజయకుమార్, ఎంటామాలజీ అధికారులు నిరంజన్, శ్రీనివాస్, కృష్ణయ్య ప్రవీణ్‌కుమార్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం


ఎల్లమ్మ కల్యాణంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్ డీబీఆర్ మిల్స్ హెల్త్ సెంటర్ వద్ద ఉన్న శ్రీరేణుక ఎల్లమ్మ, శ్రీపోచమ్మ దేవాలయంలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణం భక్తిశ్రద్ధలతో నేత్రపర్వంగా జరిగింది. శ్రీరేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు బండెల ముఖేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారి సిందం నాగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ముఖేష్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, బీఆర్ఎస్ నేతలు రాజేష్, బల్లేకారి రమేష్, దుర్గాస్వామి, సత్యనారాయణ, రాజుకుమార్, మధు, బీజేపీ నేతలు బొల్ల రమేష్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్షత్రియ రాజ్‌పుత్ సభ కమిటీని మార్చాలి

ముషీరాబాద్: క్షత్రియ రాజ్‌పుత్ సభ ఎన్నికలు ఆగస్టు 11వ తేదీన జరుగనున్నాయి. కానీ ఈలోపే ఎన్నికల కమిటీని మార్చాలని క్షత్రియ రాజ్‌పుత్ సభ వివిధ బస్తీ శాఖ సభ్యులు డిమాండ్ చేశారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల కమిటీని మార్చాలని సొసైటీ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శాఖ సభ్యులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పదేళ్లలో మూడు దఫాలుగా ప్రస్తుత ఎన్నికల కమిటీయే ఎన్నికలు నిర్వహించిందన్నారు. ఆ కమిటీపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా నిష్పక్షపాతంగా ఉండాల్సిన ఈ కమిటీ ఎన్నికల్లో ఒక వర్గానికి మద్దతు తెలుపుతోందని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో విజయ్‌సింగ్, సాయినాథ్‌సింగ్, మహేందర్‌సింగ్, మురళీమోహన్‌సింగ్, అజయ్, విక్రమ్‌సింగ్, చంద్రకిషన్‌సింగ్, శక్తిసింగ్, నర్సింగ్, భగత్‌సింగ్ ఉన్నారు.



ముషీరాబాద్ మహంకాళి బోనాలు వైభవంగా నిర్వహిస్తాం


సమావేశానికి ముందు పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

ముషీరాబాద్: నియోజకవర్గంలో ప్రసిద్ధి గాంచిన ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో ఈనెల 28, 29వ తేదీల్లో జరిగే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం దేవాలయంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆలయ నూతన కమిటీ లేనందున రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా బోనాల ఉత్సవాలను నిర్వహించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఎయిర్‌టెల్ రాజు, సంగిశెట్టి రాజ్‌కుమార్, రెబ్బ రామారావు, కాంగ్రెస్ నేత జెనిగె శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నేత నందు, బీఆర్ఎస్ నేత డి.శివముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో భారీగా పోలీసుల మోహరింపు

నిరుద్యోగుల ఆందోళనలతో అశోక్‌నగర్ చౌరస్తా మూసివేత

చిక్కడపల్లి: నిరుద్యోగులు గ్రూప్స్ పోస్టులు పెంచాలనే డిమాండ్‌తో మూడు రోజులుగా ఆందోళన చేస్తునే ఉన్నారు. మంగళవారం సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీసులు సెంట్రల్ లైబ్రరీ, అశోక్‌నగర్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ఇందిరాపార్క్ చౌరస్తాలో పోలీసులను భారీగా మోహరించారు. అశోక్‌నగర్ చౌరస్తాను మూసివేశారు. చిక్కడపల్లి, దోమలగూడ డివిజన్ల ఏసీపీలు ఎల్.రమేష్, మొగిలయ్య, సీఐలు సీతయ్య, డి.శ్రీనివాస్, ఎస్సైలు నాగరాజు, అభిలాష్, శ్రీనివాస్‌రెడ్డి, మౌనిక, శాంతి, సీఆర్‌పీఎఫ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోనాలు వైభవంగా జరుపుకోవాలి


బోనమెత్తి ఊరేగింపుగా వెళ్తున్న పాక జ్ఞానేశ్వరి, మహిళలు

చిక్కడపల్లి: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాల ఉత్సవాలను కలిసిమెలసి ఘనంగా జరుపుకోవాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి అన్నారు. మంగళవారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో జరిగిన బోనాల ఉత్సవాలకు గాంధీనగర్ నుంచి తరలివెళ్లారు.

దాతల సహకారంతోనే బాలికల వసతి గృహ నిర్మాణం

హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా


వాసవీ ఆర్యవైశ్య వసతి గృహం ప్రారంభోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గంజి రాజమౌళిగుప్తా

ముషీరాబాద్: వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహాన్ని ఈనెల 28న సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించనున్నట్లు హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా తెలిపారు. పేద విద్యార్థినులకు ఉచితంగా వసతి కల్పించేందుకు ఆధునిక వసతులతో రూ.3.5 కోట్లతో భవనం నిర్మించినట్లు తెలిపారు. మంగళవారం ముషీరాబాద్‌లోని హాస్టల్ ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్టల్ ప్రారంభోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి టీజీ వెంకటేష్ రూ.కోటి విరాళం భవన నిర్మాణానికి అందజేశారని పేర్కొన్నారు. ఈ వసతి గృహంలో 60 మంది విద్యార్థినులకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతోనే హాస్టల్‌ను నిర్మించామని పేర్కొన్నారు. వసతి గృహ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి టీజీ.వెంకటేష్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుధాకర్‌గుప్తా, సత్తయ్య, రాజశేఖర్‌గుప్తా, శ్రీనివాస్, వీరేందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్


మాట్లాడుతున్న ఏసీపీ రమేష్‌కుమార్


డ్రగ్స్‌పై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో ఏసీపీ రమేష్‌కుమార్, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు

ముషీరాబాద్: డ్రగ్స్, గంజాయి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావులు పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ స్కూల్‌లో 'డ్రగ్స్ నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం..' అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి యువత పాశ్చాత్య సంస్కృతికి బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజ హితం కోసం పాటుపడాలన్నారు. మత్తుపదార్థాలతో జరిగే అనర్థాలను యువతకు వివరించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. అహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. మారన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్నం సంస్థ రాష్ట్ర కార్యదర్శి డీజీ నర్సింహారావు, ప్రిన్సిపల్ సిస్టర్ లిండా, కామేష్‌బాబు, కళ్యాణ్, పి.సునీత, ఎస్.శిరీషా, పి.మల్లేష్, రీటా, జయంతి, రెజీనా తదితరులు పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF THE PRL. DIST. JUDGE: GUNTUR
T.O.P.No: 1462 / 2022
Between:
Smt Pachava Subba Rathnam and Others. ...Petitioners
And
M/s.Santhi Housing Plots Owners Welfare Association, Rep.by its Secretary Smt. R. Suhasini & Others. ...Respondents
To,
R-54:Velchati Mrudula Padma Saravana, W/o. Saibabu, R/o. Door No. 1-10-79, Ashok Nagar,Hyderabad, Rangareddy Dist.,Telangana State.

పైనుదాహరించిన పిటీషన్‌లో తాము [illegible] 02-08-2024 వ తేది 10-30 గం.లకు [illegible]

గాదంశెట్టి రామకృష్ణ